సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 5 | ఆగస్టు | 2023



... ఇనుప వంతెనే దిక్కు

గుండాల మండలంలో ఇటీవల వరదలకు కిన్నెరసాని బ్రిడ్జి కొట్టుకుపోగా, పాత ఇనుప వంతెనే దిక్కయింది. 10లో



సందిగ్ధంలో సబ్సిడీ రుణాలు!

మైనారిటీ రుణాలు నోటిఫికేషన్లకే పరిమితమవుతున్నాయి. దీంతో నిరుద్యోగులకు ఎదురుచూపులు తప్పడంలేదు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఉదయం అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

సీపీఆర్‌ఎంఎస్ వైద్యం రూ. 25 లక్షలకు పెంచాలి



సమావేశానికి హాజరైన ట్రస్ట్ బోర్డు సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఉద్యోగ విరమణ కార్మికులకు సీపీఆర్‌ఎంఎస్ కార్డు ద్వారా అందిస్తున్న వైద్య పరిమితిని రూ.8 లక్షలను రూ 25 లక్షలకు పెంచాలని బీఎంఎస్ నాయకుడు, (సీపీఆర్‌ఎంఎస్–ఎన్‌ఈ) ట్రస్ట్ సభ్యుడు మాధవనాయక్ కోరారు. శుక్రవారం కోల్‌కతాలో కాంట్రిబ్యుటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీమ్–నాన్ ఎగ్జిక్యూటివ్ (సీపీఆర్‌ఎంఎస్–ఎన్‌ఈ) ట్రస్ట్ బోర్డ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన వివరాలు వెల్లడించారు. సీపీఆర్‌ఎంఎస్ కార్డు పొందేందుకు వచ్చే డిసెంబర్ 30 వరకు గడువు పెంచారని తెలిపారు. కిడ్నీ, గుండె, కేన్సర్ వంటి జబ్బులకు అన్‌లిమిటెడ్ వైద్య సేవలు అందించాలని కోరగా, బోర్డు అంగీకరించిందని పేర్కొన్నారు. వైద్య సేవలు పొందాక కార్డులో మిగిలిన నగదు వివరాలు తెలియపర్చాలని, బిల్లులు 45 రోజుల్లో చెల్లించాలని కోరినట్లు తెలిపారు.

‘ఇంటింటా ఇన్నోవేటర్’ గడువు పొడిగింపు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణల దరఖాస్తు గడువు ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు ఉన్న గడువును పెంచినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా పలు ఆవిష్కరణల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2నిమిషాల వీడియో, నాలుగు ఫొటోలు, ఆరు వ్యాఖ్యాలతో ఆసక్తిగల ఔత్సాహికులు 91006 78543 నంబరుకు వాట్సాప్ ద్వారా వృత్తి, ఊరిపేరు, జిల్లా పేరుతో వివరాలు పంపించాలని తెలిపారు.

ఏసీబీ డీఎస్పీగా రమేష్



ఖమ్మంక్రైం: ఖమ్మం ఏసీబీ డీఎస్పీగా వై.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1995 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సైతం పనిచేశారు. అనంతరం పదోన్నతిపై డీఎస్పీగా నల్లగొండ జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఖమ్మం వచ్చారు. గతంలో ఇక్కడ ఏసీబీ డీఎస్పీగా ఉన్న సూర్యనారాయణ ఉద్యోగోన్నతిపై రాచకొండ కమిషనరేట్‌కు బదిలీ అయిన విషయం విదితమే. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే 91543 88981 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పేరు పర్యాటకులది.. సోకు అటవీశాఖది

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఫారెస్టు శాఖ

- అశ్వారావుపేట ప్రారంభోత్సవంపై వివాదం
- గతంలో సెంట్రల్ పార్కులోనూ ఇదే తీరు
- జిల్లాలో అటకెక్కిన ఎకో టూరిజం పనులు



దండకారణ్య (పీసీసీఐ) క్యాంపు ఆఫీసుగా మార్చిన కాటేజీలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో అటవీ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందా అంటే అవుననే సమాధానమే వస్తోంది. ఇటీవల అశ్వారావుపేటలో ఫారెస్టు శాఖ క్వార్టర్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రహస్యంగా నిర్వహించి ఆ శాఖ అభాసుపాలైంది. అలాంటి ఘటనే కొన్ని నెలల కిందట కొత్తగూడెంలోనూ చోటు చేసుకుంది.

ఎకో టూరిజం అభివృద్ధికి బాటలు

కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కేంద్రంగా చేసుకుని ఎకో టూరిజం అభివృద్ధి చేయాలని అప్పటి ఎమ్మెల్యే జలగం భావించారు. అందులో భాగంగా కిన్నెరసాని దగ్గర కాటేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కశ్మీర్‌లోని దాల్‌లేక్‌లో ఎంతో ప్రసిద్ధి చెందిన బోట్‌హౌస్ టూరిజాన్ని కిన్నెరసానిలో ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక కూడా సిద్ధం చేశారు. దీనికి అనుబంధంగా ఇల్లెందు క్రాస్‌రోడ్ దగ్గర హరిత హోటల్, కాటేజీలు, సెంట్రల్ పార్కులో పర్యాటకులు విడిది చేసేందుకు వీలుగా కాటేజీల నిర్మాణం, బోటింగ్ తదితర సౌకర్యాలతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు భద్రతాపరమైన సమస్యలు రావొద్దనే లక్ష్యంతో పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌ను కిన్నెరసాని డ్యామ్ సైట్ దగ్గరకు, లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను హరిత హోటల్ వెనుక, సెంట్రల్ పార్కుకు అతి సమీపంలో నిర్మించాలని నిర్ణయించారు. పక్కా ప్లాన్ ప్రకారం జిల్లా కేంద్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి బాటలు వేశారు.

ఏడేళ్ల క్రితం సెంట్రల్ పార్క్ నిర్మాణం

కొత్తగూడెం పట్టణంలో ఉన్న అటవీశాఖకు చెందిన భూములకు రక్షణ కల్పించడంతోపాటు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేందుకు సెంట్రల్ పార్కును నిర్మించారు. ఇల్లెందు క్రాస్‌రోడ్డు దగ్గర సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో ఏడేళ్ల కిందట ఈ పార్కును నిర్మించారు. సుమారు రూ 1.50 కోట్ల వ్యయంతో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించారు. అప్పటికే ఉన్న చిట్టడవికి తోడుగా హరితహారంలో సుమారు లక్ష వరకు వివిధ రకాల మొక్కలు నాటారు. ఆ తర్వాత పార్కుకు వచ్చే వారికి మరిన్ని సేవలు అందించేందుకు ఓపెన్‌జిమ్, కేఫ్‌టేరియా, చిల్డ్రన్స్ ప్లేజోన్ ఏర్పాటు చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) ఫండ్స్‌ను ప్రత్యేకంగా తెప్పించుకుని పగోడాలు, యోగా షెడ్స్, వాకింగ్ ట్రాక్, టాయిలెట్లు నిర్మించారు. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు దీటుగా సెంట్రల్ పార్క్‌ను అభివృద్ధి చేశారు.



శిథిలమవుతున్న బోట్లు

ఆగిపోయిన హరిత హోటల్, కిన్నెరసాని కాటేజీల నిర్మాణం

విస్తారమైన అడవులు, కిన్నెరసాని డ్యామ్, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రం ఉన్న జిల్లాలో పర్యాటకులను ఆకట్టుకునేందుకు ప్రభుత్వ పరంగా చేపట్టిన చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. అందువల్లే ఎకో టూరిజంలో భాగమైన కిన్నెరసాని కాటేజీలు కొత్తగూడెం హరిత హోటల్ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. బోట్‌హౌస్ కాన్సెప్ట్ అటకెక్కింది. ఎకో టూరిజంలో ఆశాకిరణంలా ఉన్నది సెంట్రల్ పార్కు ఒక్కటే. కానీ ఇక్కడ సిద్ధమైన కాటేజీలను ఫారెస్టు శాఖ పర్యాటకులకు దూరం చేసింది. అంతే కాదు ఇక్కడ బోటింగ్‌కు సంబంధించిన పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. చెరువు, జెట్టీలు, బోట్లు అన్నీ సిద్ధమయ్యాయి. కానీ వీటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విషయంలో ఫారెస్టు శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా బోట్లు చెత్త కుప్పల్లో చేరి పనికిరాకుండా పోతున్నాయి.

కాటేజీల ప్రాంతం.. పర్యాటకులకు నిషేధం

సెంట్రల్ పార్కు– ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా రూ. 30 లక్షలతో నిర్మించిన గోదావరి, కిన్నెరసాని అనే పేరుతో రెండు కాటేజీలు వినియోగానికి సిద్ధమయ్యాయి. అయితే గుట్టు చప్పుడు కాకుండా ఫారెస్టు శాఖ రెండు నెలల కిందట వీటిని ప్రారంభించింది. స్థానిక ప్రజాప్రతినిధులెవరికీ కించిత్ కూడా సమాచారం ఇవ్వలేదు. హైదరాబాద్‌లో ఉండే ఆ శాఖ ఉన్నతాధికారులు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఉపయోగించుకునేందుకు వీలుగా ప్రణాళిక మార్చారు. ప్రస్తుత ఈ కాటేజీలను దండకారణ్య (పీసీసీఐ) క్యాంపు ఆఫీసుగా పిలుస్తున్నారు. దీంతో ఈ కాటేజీలు ఉన్న ప్రాంతాన్ని సెంట్రల్ పార్కులో నిషేధిత ప్రాంతంగా మార్చేశారు. ప్రజలు, పర్యాటకుల కోసమంటూ నిర్మించిన కాటేజీలను ఆ శాఖకే పరిమితం చేయడం పలు ఆరోపణలకు దారితీస్తోంది. మరోవైపు ఇదే పార్కులో కొత్త కాటేజీల నిర్మాణం కోసం మూడు కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉన్న వాటిని అందుబాటులోకి తేకుండా కొత్త కాటేజీల పేరుతో మాయ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వినిపించని ‘గూడెం’ గొంతుక

- కొనసాగుతున్న అసెంబ్లీ సమావేశాలు
- కొత్తగూడెం నుంచి వనమా, జలగం ఎవరూ వెళ్లలేని పరిస్థితి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శాసన సభ సమావేశాల్లో కొత్తగూడెం ఓటర్ల తరఫున ప్రజాప్రతినిధి లేని పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎన్నికైన వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా గుర్తించాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయించే పనిలో వనమా వెంకటేశ్వరరావు ఉన్నారు. సుప్రీం బెంచ్ ముందుకు సోమవారం వనమా కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది. దీంతో వనమా వెంకటేశ్వరరావు అసెంబ్లీకి దూరంగా ఉన్నారు. కాగా హైకోర్టు తీర్పును అమలు చేయాలంటూ జలగం వెంకట్రావు ఇప్పటికే అసెంబ్లీ కార్యదర్శి, స్టేట్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు జడ్జిమెంట్ కాపీలను అందించారు. అయితే హైకోర్టు తీర్పు అమలుకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఇంకా ఎటువంటి నిర్ణయం అధికారికంగా వెల్లడి కాలేదు. దీంతో ఇటు జలగం సైతం శాసన సభా వ్యవహారాలకు దూరంగా ఉన్నారు.

ఇదే తొలిసారి..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా 1957లో ఎన్నికలు జరిగాయి. అప్పుడు పాల్వంచ కేంద్రంగా నియోజకవర్గం ఉండేది. పాల్వంచ నియోజకవర్గానికి నాలుగు సార్లు ఎన్నికలు జరిగాయి. చివరిసారిగా 1972లో జరిగిన సాధారణ ఎన్నికల్లో చేకూరి కాశయ్య ఇక్కడి నుంచి గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో పాల్వంచ రద్దయింది. ఆ స్థానంలో కొత్తగూడెం కేంద్రంగా నియోజకవర్గం ఏర్పాటైంది. ఈ స్థానానికి ఇప్పటివరకు పది సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ స్థానానికి ఉప ఎన్నిక ఎప్పుడూ జరగలేదు. మొత్తంగా పద్నాలుగు మంది ఇక్కడి నుంచి శాసన సభలో అడుగు పెట్టారు. పద్నాలుగు శాసన సభ సమావేశాలకు ప్రజాప్రతినిధులకు హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల వల్ల ఎవరైనా ఎప్పుడైనా శాసన సభకు హాజరుకాలేకపోయి ఉండవచ్చు. కానీ చట్టపరమైన కారణాలతో ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లలేని పరిస్థితి తొలిసారిగా ఎదురైంది. అది కూడా 14వ శాసన సభ చివరి సమావేశాల సందర్భంగా చోటు చేసుకోవడం గమనార్హం.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం పంచామృతాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు భక్తులు పాల్గొన్నారు.



తరగతి గదిలో పాఠం చదువుతున్న విద్యార్థులు (ఇన్‌సెట్) వర్క్‌బుక్స్

రీడింగ్.. రైటింగ్..

- ‘తొలిమెట్టు’తో విద్యార్థుల సామర్థ్యం పెంపునకు కృషి
- ఈ ఏడాది కొత్తగా వర్క్‌బుక్స్‌తో అభ్యసనం
- పునాది పటిష్టానికి విద్యాశాఖ చర్యలు
- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యనభ్యసించే విద్యార్థుల బేసిక్ నాలెడ్జ్‌ను పటిష్ఠం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమాన్ని గతేడాది నుంచే అమలు చేస్తున్నా ఈ ఏడాది మరింత మెరుగులుదిద్ది కొనసాగిస్తోంది. రీడింగ్, రైటింగ్ ప్రక్రియల్లో విద్యార్థులు పట్టు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఈ ఏడాది నోట్ పుస్తకాలు కొనుగోలు చేసే పని లేకుండా 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు వర్క్‌బుక్స్ అందజేశారు. పాఠ్యపుస్తకాలతో పాటుగా వర్క్‌బుక్స్, లెసన్ ప్లాన్ మూడింటిని సమన్వయం చేస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయనున్నారు. ఇప్పటికే జిల్లా సెక్టోరియల్ అధికారులు జిల్లా స్థాయిలో తెలుగు, ఆంగ్లం, మ్యాథ్స్ ఉపాధ్యాయులు 138 మందికి శిక్షణ ఇచ్చారు. వీరు మండలస్థాయిలో శిక్షణ ఇస్తుండగా, గత నెల 31న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 8వ తేదీతో ముగియనుంది. అనంతరం జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమంపై వర్క్‌షీట్ రాయడం, చదివించడం చేస్తారు. కరోనా సమయంలో విద్యార్థులు బేసిక్ నాలెడ్జ్‌ను అభ్యసించకుండానే ఉత్తీర్ణత పొంది పైతరగతులకు చేరారు. వారంతా పదో తరగతి, భవిష్యత్‌లో ఉన్నత చదువుల్లో ఇబ్బంది పడకుండా ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

సబ్జెక్టుకు 90 నిమిషాలు

ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులలో ప్రావీణ్యం సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. వీటిలో మెరుగుపడితే మిగిలిన సబ్జెక్టులు కూడా సులువుగా నేర్చుకునే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తరగతి గదిలో ఒక సబ్జెక్టుకు 90 నిమిషాలు కేటాయించి విద్యా బోధన చేయనున్నారు. 45 నిమిషాలు పాఠ్యాంశాల బోధన, మరో 45 నిమిషాలు వర్క్‌బుక్స్ చదివించడం, రాయించడం వంటివి చేయనున్నారు. పాఠ్యాంశ పుస్తకాలతోపాటు, ఇతర అంశాలు కూడా జోడించి ప్రచురితమైన వర్క్‌బుక్స్‌లలో విద్యార్థులకు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అవగాహన ఏర్పాడే అవకాశం ఉంది. వీటితోపాటు వివిధ రకాల కథలు కూడా ఉన్నాయి.

గతేడాది సత్ఫలితాలు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. శిక్షణ ఈ నెల 8వ వరకు సాగుతుంది. అనంతరం వర్క్‌బుక్స్ లో విద్యార్థులతో రాయించడం, చదివించడం వంటివి చేస్తారు. గతేడాది తొలిమెట్టు కార్యక్రమంతో సత్ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం.

– ఇ.సోమశేఖరశర్మ, డీఈఓ

విద్యాప్రగతికి దోహదపడాలి



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఇల్లెందురూరల్: ఉపాధ్యాయులు విద్యాప్రగతికి దోహదపడాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన జిల్లా కోఆర్డినేటర్ నాగరాజుశేఖర్ కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ బోధించిన ప్రతీ అంశాన్ని విద్యార్థులతో క్రమం తప్పకుండా సాధన చేయించాలన్నారు. ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల కేటాయింపునకు కసరత్తు

- సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రత్యేక అధికారుల నియామకం
- ఇక్కడి 239 మందితోపాటు ఇతర జిల్లాల వారినీ సర్దుబాటు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు చేసిన నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న 239 వీఆర్‌ఏలను వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించేందుకు కసరత్తు ప్రారంభమైంది. వీఆర్‌ఏల సర్వీసు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వారసత్వ ఉద్యోగాల అంశం పరిశీలన కోసం ఆరుగురిని ప్రత్యేక అధికారులుగా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల నియమించారు. ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, అశ్వాపురం మండలాలకు జిల్లా పౌరసరఫరాల అధికారి త్రినాథ్‌బాబు, అశ్వారావుపేట, భద్రాచలం, బూర్గంపాడు, చండ్రుగొండ మండలాలకు భూగర్భజల శాఖాధికారి ఎం.బాలు, చర్ల, చుంచుపల్లి, దమ్మపేట, దుమ్ముగూడెం మండలాలకు జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న గుండాల, జూలూరుపాడు, కరకగూడెం, కొత్తగూడెం మండలాలకు జిల్లా పరిశ్రమల శాఖాధికారి టి.సీతారామ్ నాయక్, లక్ష్మీదేవిపల్లి, ములకలపల్లి, పాల్వంచ, పినపాక మండలాలకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి, సుజాతనగర్, టేకులపల్లి, ఇల్లెందు మండలాలకు జెడ్పీ సీఈఓ విద్యాలతను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

కేటాయింపులు ఇలా..

రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్లుగా 96 మంది, ఎంఎఅండ్‌యూడీ డిపార్ట్‌మెంట్‌లో వార్డు ఆఫీసర్లుగా 42 మంది, రెవెన్యూలో రికార్డు అసిస్టెంట్లుగా 70 మంది, రెవెన్యూలో ఆఫీస్ సబార్డినేట్లుగా 10 మంది, ఇరిగేషన్‌లో లష్కర్, హెల్పర్లుగా 143, మిషన్‌భగీరథలో హెల్పర్లుగా 132 మందిని కేటాయించనున్నారు. వీరిలో 239 మంది జిల్లాకు చెందిన వీఆర్‌ఏలు కాగా, మిగతావారు ఇతర జిల్లాలలో పనిచేస్తున్న వారు ఉన్నారు. జిల్లాలో సర్దుబాటుకు అవకాశాలు ఎక్కువగా ఉండడంతో అదనంగా ఇతర జిల్లాల వారికి కూడా ఇక్కడ పోస్టులు కేటాయిస్తున్నారు.

బంధువుల ముందు నిబంధనలు ఏపాటి?

- జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో సిత్రం
- నోటిఫికేషన్‌లో ‘లోకల్’ కాలమ్ మాయం
- రద్దు చేయాలని కోరుతున్న దరఖాస్తుదారులు
- 8 పోస్టులకు 379 అప్లికేషన్లు

కొత్తగూడెంటౌన్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ(ఐసీడీఎస్), వికలాంగులు, వయోవృద్ధుల శాఖ అధికారులు బంధువుల కోసం ఉద్యోగ నోటిఫికేషన్‌లో నిబంధనలను సైతం మార్చేశారు. సంబంధిత శాఖలో కీలక అధికారిణి ఒకరు తమ దగ్గరి బంధువులకు ఉద్యోగాలు కట్టబెట్టేందుకు ఈ తతంగం నడుపుతున్నట్లు పలువురు నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. ఐసీడీఎస్‌లోని చైల్డ్ హెల్ప్‌లైన్ విభాగంలో ఔట్ సోర్సింగ్ విధానంలో రెండేళ్ల కాలానికి 8 పోస్టుల భర్తీకి గత జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చారు. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. జూన్ 18న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేస్తామని, అదే నెల 23న ఇంటర్వ్యూలు, 30లోగా పోలీస్ వెరిఫికేషన్, జూలై 4వ తేదీలోపు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కాగా 8 పోస్టులకు జిల్లా వ్యాప్తంగా 379 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు స్వీకరించిన అధికారులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఇంటర్వ్యూలకు కూడా ఆహ్వానం పంపారు.



జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం

కనిపించని లోకల్ కాలమ్

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ విడుదల చేసిన ఈ నోటిఫికేషన్‌లో లోకల్/నాన్ లోకల్ నిబంధన ప్రస్తావించలేదు. ఇవే పోస్టులకు జూన్‌లోనే జనగామ, వికారాబాద్, ఆసిఫాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో కూడా నోటిఫికేషన్లు జారీ చేశారు. అక్కడి అధికారులు ఆయా జిల్లాలకు చెందినవారు మాత్రమే అర్హులని స్పష్టంగా పేర్కొన్నారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్–2018 ప్రకారం కరీంనగర్ జిల్లా అభ్యర్థులు మాత్రమే అర్హులని, కరీంనగర్ నోటిఫికేషన్‌లో వివరించారు. కానీ భద్రాద్రి జిల్లాలో స్థానిక అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొనలేదు. ఇంటర్వ్యూకు ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాలో అనర్హులు ఉన్నట్లు సమాచారం. నామమాత్రంగా ఇంటర్వ్యూ ప్రక్రియ నిర్వహించి ఇతర జిల్లాలకు చెందిన తమ బంధువులతో ఖాళీలను భర్తీ చేసేందుకు ఐసీడీఎస్ అధికారులు, దళారులతో కుమ్మక్కై కనట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వేతనాలు ఇలా..

డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ పోస్టు ఒకటి ఉండగా, నెలకు రూ.28 వేల వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టుకు 60 మందిని ఇంటర్వ్యూకు పిలిచారు. రూ.18,536 వేతనంతో సోషల్ వర్కర్ కౌన్సిలర్ పోస్టు ఒకటి ఉండగా 150 మందిని ఇంటర్వ్యూకు పిలిచారు. చైల్డ్ హెల్ప్‌లైన్ హెల్పర్ పోస్టులు మూడు ఉండగా, వేతనం రూ.19,500 ఇవ్వనున్నారు. కేసు వర్కర్ పోస్టులు మూడు ఉండగా, వేతనం రూ.15,600 ఇవ్వనున్నారు. ఈ పోస్టులకు 150 మందిని ఇంటర్వ్యూకు ఆహ్వానించారు. కాగా ఇదే సమయంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు బదిలీ కావడం, ఆ తర్వాత గోదావరి వరదలు జిల్లాలోని ఏజెన్సీ ముంచెత్తడం వంటి కారణాలతో ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. కలెక్టర్ స్పందించి సదరు నోటిఫికేషన్ రద్దు చేసి, ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని పలువురు నిరుద్యోగులు కోరుతున్నారు.

రద్దు చేయాలి



జిల్లా సంక్షేమశాఖలో 8 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో లోకల్ అభ్యర్థులే అర్హులని పేర్కొనకపోవడం అన్యాయం. కొందరు అధికారులు, దళారులు కలిసి ఉద్యోగాలు కాజేసే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాం. నోటిఫికేషన్ రద్దు చేసి, పారదర్శకంగా నియామకాలు చేపట్టాలి.

–ఎం.జానకీరాం, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు

నిబంధనలకు లోబడే ఇచ్చాం



ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నోటిఫికేషన్ నిబంధనలకు లోబడే ఇచ్చాం. కలెక్టర్, అదనపు కలెక్టర్ బదిలీతోపాటు వరదల ప్రభావంతో ఎంపికలు వాయిదా పడ్డాయి. త్వరలో ఇంటర్వ్యూ తేదీ ప్రకటించి నియామకాలు చేపడతాం. ఈ ఉద్యోగాలు నాన్ లోకల్‌కు ఎవరైనా ఇస్తారా?

–ఎం.సవిత, జిల్లా సంక్షేమశాఖ అధికారి

క్లుప్తంగా

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



భేతాళపాడులో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

జూలూరుపాడు: మండలంలోని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగంపై శుక్రవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. భేతాళపాడు, గుండ్లరేవు, అన్నారుపాడు, భోజ్యాతండా, జడలచింత, కొత్తూరు, వినోభానగర్ పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లకు మొబైల్ డెమాన్‌స్ట్రేషన్ వెహికల్(ఎండీవీ) సిబ్బంది వివరించారు. ఓటు హక్కు వినియోగించుకున్నాక తాను ఎంపిక చేసుకున్న అభ్యర్థికి ఓటు వేశామా? లేదా అనే విషయాన్ని వీవీ ప్యాట్ ద్వారా చూసుకోవచ్చన్నారు. సిబ్బంది ఎం.తిరుపతిరావు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

యానంబైల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



కిన్నెరసాని బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య హైలెవల్ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో బ్రిడ్జి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.9 కోట్లతో కిన్నెరసాని వాగుపై బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించారని, రెండేళ్లు గడిచినా పనులు పూర్తి కాలేదన్నారు. పనులు సకాలంలో పూర్తిచేయలేని కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో రాకపోకలు నిలిచిపోయి ఎగువన ఉన్న 24 గిరిజన గ్రామాల ప్రజలు అవస్థ పడ్డారని అన్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి పనులు పూర్తిచేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లిఖార్జున్‌రావు, సాయి,దేశెట్టి రాజు, రావుల వీరస్వామి, పాకపాటి రాంబాబులు పాల్గొన్నారు.

అభ్యాసన పత్రాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ పరిశీలకుడు స్వరూప్‌కుమార్

చర్ల: పాఠ్య పుస్తక తాత్వికతను అర్థం చేసుకొని ప్రణాళికబద్ధంగా మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధనకు అభ్యాసన పత్రాలను వినియోగించుకోవాలని విద్యాశాఖ జిల్లా పరిశీలకుడు స్వరూప్‌కుమార్ సూచించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని సత్యనారాయణపురంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల గణిత భావన ఎంతమేర జరుగుతుందో తెలుసుకునేందుకు అభ్యాసన పత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఏవీ రామారావు, మండల రీసోర్స్‌పర్సన్లు పర్శిక నాగేశ్వరావు, ఎం.ప్రభాకర్, కల్లూరి కృష్ణ, సీహెచ్.హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

మురుగు గుంతలో ద్విచక్ర వాహనం..

అశ్వారావుపేటరూరల్: ఓ మురుగునీటి గుంతలో ద్విచక్రవాహనం శుక్రవారం లభ్యమైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ వెనుక భాగంలో ఉన్న ఓ పెద్ద మురుగు గుంతలో ద్విచక్రవాహనాన్ని (ప్యాషన్ ప్రొ)ను గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లారు. ఈనేపథ్యాన పొలాలకు అటుగా వెళ్లే రైతులు గమనించి, వాహనాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందివ్వగా వారు అక్కడకు చేరుకొని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, ఈ వాహనం దమ్మపేట మండలానికి చెందిన ఓ వ్యక్తిగా గుర్తించారు. మతిస్థిమితం సరిగాలేక మురుగుగుంతలో పడేసినట్లు తెలిసింది.

జ్వరంతో మహిళ మృతి

చర్ల: మండలంలోని బోదనెల్లికి చెందిన ఓ గిరిజన మహిళ జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. బోదనెల్లి గ్రామానికి చెందిన కారం లక్ష్మి (45)కి జ్వరం రావడంతో రెండు రోజులపాటు ఆర్.కొత్తగూడెంలోని ఓ గ్రామీణ వైద్యుని వద్ద చికిత్స పొందింది. నయంకాకపోవడతో కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఆమె మృతి చెందింది. కాగా డెంగీ జ్వరంతోనే లక్ష్మి మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

సందిగ్ధంలో సబ్సిడీ రుణాలు!

నోటిఫికేషన్లకే పరిమితమవుతున్న మైనార్టీ రుణాలు

- వందశాతం రుణాల జీఓకు పాత దరఖాస్తులు
- నియోజకవర్గానికి 100 చొప్పున లబ్ధిదారులు
- ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.5 కోట్లు కేటాయింపు
- అధికారుల అలసత్వంతో పూర్తికాని ఎంపికలు



కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలుకావటం లేదు. గత తొమ్మిదేళ్ల పాలనలో మైనార్టీల స్వయం ఉపాధి కోసం రెండు సార్లు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. కాని అధికారుల అలసత్వంతో స్వయం ఉపాధి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. గత డిసెంబర్‌లో జిల్లాకు 140 యూనిట్లకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 3,377మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.. కానీ రుణాల ఎంపిక నేటి వరకూ పూర్తికాలేదు. కాగా, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన నివేదిక జిల్లా మైనార్టీ కార్యాలయానికి ఇంకా చేరలేదని తెలిసింది. జిల్లా మైనార్టీ అధికారికి.. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించటంతో రుణాల ఎంపికలో జాప్యం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

500 మందికి సబ్సిడీ రుణాలు..

రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలు ముస్లింలు, సిక్కులు, పార్శీలు, జైనులు, బౌద్ధులకు వందశాతం సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు ఇటీవల సీఎం ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గానికి 100 చొప్పున జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 500 రుణాలు కేటాయించి రూ.5కోట్లు కేటాయించారు. గతేడాది దరఖాస్తు చేసుకున్న వారికి రుణం అందకపోతే.. రూ.లక్ష ఆర్థిక సాయం కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

నిధులు కేటాయింపు ఇలా..

గతేడాది డిసెంబర్‌లో జిల్లాకు 140 యూనిట్లు కేటాయించగా.. మొదటి విడతలో 70 యూనిట్లకు రూ.68.60 లక్షలు, రెండో విడతలో మరో 70 యూనిట్లు రూ.68.60లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. ఇందులో కేటగిరి-1 కింద 49 యూనిట్లు, కేటగిరి-2 కింద 21 యూనిట్లు వచ్చాయి. కేటగిరి-1 కింద రూ.లక్ష రుణం తీసుకుంటే 80 శాతం సబ్సిడీ పోను లబ్ధిదారుడు రూ.20 వేలు కట్టాల్సి ఉంటుంది. అలాగే కేటగిరి-2 కింద తీసుకున్న రూ.2 లక్షల రుణానికి 140 శాతం సబ్సిడీ పోనూ రూ.60వేలు వాటా చెల్లించాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా.. దరఖాస్తు చేసుకునేందుకు మైనార్టీలు మీసేవా కేంద్రాల చుట్టూ ప్రదర్శనలు చేస్తుండగా.. సైట్ ఓపెన్ కాక నానా అవస్థలు పడుతున్నారు.

నోటిఫికేషన్లు లేని సంవత్సరాలు..

2016 సంవత్సరం నుంచి 2021 వరకు మైనార్టీ రుణాలకు నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో చాలామంది నిరుద్యోగులకు స్వయం ఉపాధికి దూరమయ్యారు. కాగా, 2022లో 140 యూనిట్లకు నోటిఫికేషన్ ఇచ్చినా.. నేటికీ రుణాల పంపిణీకి నోచుకోలేదు.

పాత దరఖాస్తుదారులకు అవకాశం..

రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు 78 జీఓ ప్రకారం.. 2022-23 డిసెంబర్‌లో దరఖాస్తు చేసుకొని రుణాలు మంజూరు కాని వారికి ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన వందశాతం రూ.లక్ష రుణాలలో ప్రాధాన్యత కల్పించాలని ఆదేశాలు ఉన్నాయి. క్రిస్టియన్ రుణాల దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు కానీ.. మైనార్టీలు వందశాతం సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీ శాఖ వెల్లడించకపోవడం ఆశ్చర్యం కలిస్తోంది. జిల్లాలో 63,438 మంది మైనార్టీ ఉండగా.. గతేడాది 140 యూనిట్లు, ఈ ఏడాది 500 యూనిట్లు కలిపి జిల్లాకు మొత్తం 640 యూనిట్లు కేటాయించారు. కాగా, ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు 2015 సంవత్సరంలో మంజూరైన యూనిట్లకు 887 మంది దరఖాస్తు చేసుకోగా 287 మందిని ఎంపిక చేశారు. ఇందులో ఒక్కో జిల్లాకు 107 మంది చొప్పున రూ.96.18లక్షలు రుణాలు ఇచ్చారు. అధికారుల నిర్లక్ష్యంతో గతేడాది రుణాలే అందని ద్రాక్షగా మారితే.. మళ్లీ కొత్త రుణాలు ఎప్పుడు వస్తాయోనని లబ్ధిదారులు ఆలోచనలో పడ్డారు.

జిల్లాకు 500 యూనిట్లు లక్ష్యం..



జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో వందశాతం చొప్పున రూ.లక్ష సబ్సిడీ రుణాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. గతేడాది డిసెంబర్‌లో మంజూరైన 140 యూనిట్లు రద్దు చేయబడ్డాయి. కాకపోతే గతంలో వచ్చిన 3,377 దరఖాస్తులను వందశాతం రుణాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటూ మైనార్టీల నుంచి దరఖాస్తులు తీసుకోబడతాయి. - సంజీవరావు, ఈడీ

అట్టడుగు వర్గాలకు సేవ చేస్తా..

ఇన్‌కం ట్యాక్స్ రాష్ట్ర కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్



జీవన్‌లాల్‌తో కాళోజీ బయోపిక్ యూనిట్, మున్సిపల్ చైర్మన్, తదితరులు

ఇల్లెందు: అట్టడుగు వర్గాలకు సేవ చేసేలా అందరికీ అందుబాటులో ఉంటానని తెలంగాణ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్(ఐఆర్ఎస్) తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాములునాయక్ కుమారుడైన ఆయన ఇల్లెందులోని సుభాష్‌నగర్‌లో జీవన్‌లాల్ సేన పేరిట ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. అభాగ్యులకు తన సేవలు అవసరం అనుకుని వస్తే చేరదీసి అండగా నిలుస్తానని చెప్పారు. హైదరాబాద్‌లో ఉంటున్న తనకు వారధిలా ఉండేలా సన్నిహితుల సూచనతో ఇల్లెందులో కార్యాలయం ఏర్పాటు చేశానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ కష్టం వచ్చినా తనకు సమాచారం అందిస్తే చాలని చెప్పారు. అయితే, బడుగు బలహీన వర్గాల్లో మార్పు తీసుకుని రావాల్సి ఉందన్నారు. కాగా, జీవన్‌లాల్‌ను ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కోట మైసమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు కలవగా బానోతు వెంకటేశ్వర్లు, సునేష్‌నాయక్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దివంగత కాళోజీ నారాయణరావు పేరిట ఓ బయోపిక్ నిర్మిస్తుండగా, సినీ యూనిట్ సభ్యులు జీవన్‌లాల్‌తో కలిసి ఇల్లెందు వచ్చారు. షూటింగ్ వైరా ప్రాంతంలో ఉంటుందని, తాను సైతం ఓ పాత్ర పోషించనున్నానని జీవన్‌లాల్ తెలిపారు.

ప్లాంటేషన్ కటింగ్‌ను అడ్డుకున్న గిరిజనులు



గిరిజనులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ తిరుమలరావు

దమ్మపేట: ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఆధ్వర్యాన చేపట్టిన ప్లాంటేషన్‌లో జామాయిల్ చెట్లను కట్ చేస్తుండగా.. గిరిజనులు అడ్డుకున్న సంఘటన ఇది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నాగుపల్లి గ్రామానికి సమీపాన ఉన్న నల్లివారిగూడెంలో జామాయిల్ చెట్ల అమ్మకం కోసం కార్పొరేషన్ వారు చెట్లను కట్ చేస్తున్నారు. ఈక్రమంలో స్థానిక గిరిజనులు ఈ భూములు మావే అంటూ కట్టింగ్ పనులను అడ్డగించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పాల్వంచ, ఫారెస్ట్ డివిజనల్ అధికారి తిరుమలరావు, సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని గిరిజనులతో మాట్లాడారు. నల్లివారిగూడెం పరిధిలోని ప్లాంటేషన్ భూములను 1973వ సంవత్సరంలో రిజర్వ్‌డ్ ఫారెస్ట్ భూములుగా ధ్రువీకరించి, 1975వ సంవత్సరంలో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు లీజుకు ఇచ్చామని, అప్పటి నుంచి 2011 వరకు కార్పొరేషన్ వారు వెదురు, జామాయిల్ ప్లాంటేషన్ ప్రారంభించారని వివరించారు. ఏమైనా ఆధారాలు ఉంటే తనకు అందజేయాలని కోరగా.. ప్రస్తుతానికి గిరిజనుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. అనంతరం గిరిజనుల ఆందోళన విరమించగా.. కార్పొరేషన్ వారు కటింగ్‌ను నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఫారెస్టు రేంజర్ కరుణాకర చారి, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, ఎఫ్‌డీసీ డీఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌మార్కెట్‌లో చోరీ..



దుండగులు తొలగించిన మార్కెట్ పైకప్పు రేకులు

అశ్వారావుపేట: ఓ సూపర్‌మార్కెట్‌లో కొందరు దుండగులు చొరబడి అందులోని నగదు, విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లిన సంఘటన అశ్వారావుపేటలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎస్ సూపర్ మార్కెట్ పైకప్పు రేకును గురువారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు తొలగించి లోనికి ప్రవేశించారు. కౌంటర్‌లోని రూ.10వేల నగదుతో పాటు రూ.50వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం మార్కెట్ తెరిచిన యజమాని షేక్ హుస్సేన్ పైకప్పు తొలగించి, సీలింగ్ పగలకొట్టి ఉండటాన్ని గమనించి సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా వివరాలు తెలిశాయి. దీంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

మూడు రోజుల తర్వాత గుర్తించిన స్థానికులు



వెంకటేష్ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: కుటుంబ కలహాల నేపథ్యాన భార్య వెళ్లిపోవడంతో మద్యానికి బానిసైన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పరిశీలించగా మూడు రోజుల తర్వాత విషయం బయటపడింది. వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెం ఫోర్ ఇంక్లైన్ ఏరియా క్యాంపునకు చెందిన పంజార వెంకటేష్ రామవరానికి చెందిన యువతిని ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించగా, ఏడాదిన్నరగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. రోజు మద్యం తాగొచ్చే ఆయన భార్యను కొడుతుండడంతో ఆమె పిల్లలతో సహా ఆరు నెలల నుంచి విడిగా ఉంటోంది. అప్పటి నుంచి మద్యానికి మరింత బానిసైన కృష్ణ ఇంటికి నాలుగు రోజులుగా తాళం వేసి ఉండడంతో ఊరు వెళ్లాడని స్థానికులు భావించారు. కానీ శుక్రవారం ఉదయం దుర్వాసన వస్తుండడంతో కిటికీలు పగలగొట్టి చూడగా కృష్ణ ఉరి వేసుకుని కనిపించాడు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితికి చేరడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ రమేష్, సిబ్బంది చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

మందుపాతరలు నిర్వీర్యం

చర్ల: సరిహద్దు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం మావోయిస్టులు ఏర్పాటు చేసిన రెండు శక్తివంతమైన మందుపాతరలను భద్రతా బలగాలు గుర్తించి నిర్వీర్యం చేశారు. వివరాలిలా ఉన్నా యి. సరిహద్దున ఉన్న బీజాపూర్-సుకుమా జిల్లాల సరిహద్దుల్లోని గోలకొండ గుట్టల్లో పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు 4 కిలోల చొప్పున 50 మీటర్ల దూరంతో రెండు శక్తివంతమైన మందుపాతరలను ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో ఏరియా డామినేషన్‌లో భాగంగా జేగురుగొండ పోలీస్ స్టేషన్ నుంచి 210 కోబ్రా బెటాలియన్‌కు చెందిన జవాన్లు బయలుదేరి వెళ్తున్న క్రమంలో బలగాలు ఈ మందుపాతరలను గుర్తించాయి. వైర్లు బయటకు కనిపిస్తుండడంతో భద్రతా బలగాలు గుర్తించి నిర్వీర్యం చేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: ఓ వ్యక్తిపై అకారణంగా కొందరు దాడి చేసిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్సై తెలిపిన అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజుపేటకాలనీకి చెందిన దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని, తన ఆటోను ఈ నెల 2వ తేదీన వెంకన్న, బాలాజీ, రియాజ్, మహేష్, ముత్యాలు అనే వ్యక్తులు అకారణంగా దుర్భాషలాడుతూ కర్రలతో దాడి చేశారు. దీంతో తీవ్రగాయాలైన దుర్గాప్రసాద్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాక శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇంటికి నిప్పంటించిన దుండగులపై..

పాల్వంచరూరల్: ఓ ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన గుర్తు తెలియని దుండగులపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కార్తీక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని దంతలబోరు గ్రామ శివారులో నివాసం ఉంటున్న వెల్లంకి శివరామకృష్ణ ఇంటిపై బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి విద్యుత్ వైర్లు కట్ చేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈమేరకు శివరామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దుండగులపై కేసు నమోదు చేశారు.

కారు డ్రైవర్‌పై..

ఆటోను ఓ కారు ఢీకొనగా ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రంగాపురం గ్రామ సమీపంలో ఈ నెల 2వ తేదీన పాల్వంచ నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న ఆటోను భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న దుమ్మ శ్రీనివాస్, శారదలకు గాయాలయ్యాయి. ఈమేరకు ఆటో డ్రైవర్ కోళ్ల అంజనేయులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పాల్వంచకు చెందిన కారు డ్రైవర్ దండ యాదగిరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

భౌతిక దాడి ఘటనపై..

దమ్మపేట: వ్యవసాయానికి ఉపయోగించే నీటి పైపుల వివాదంలో ఓ మహిళపై కొందరు దాడి చేసిన ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని అంకంపాలెం, ఆర్లపెంట గ్రామాలకు చెందిన కూరం భద్రయ్య, కూరం భద్రమ్మ, కూరం సత్తిబాబు అను ముగ్గురు వ్యక్తులు వ్యవసాయానికి ఉపయోగించే నీటి పైపుల వివాదంలో ఆర్లపెంట గ్రామానికి చెందిన కాకా నాగమణి అనే మహిళతో గురువారం రాత్రి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో ఆ ముగ్గురు వ్యక్తులు నాగమణితో పాటు ఆమె తల్లిని కూడా అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ వారిపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

సైబర్ క్రైమ్ ఘటనపై..

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియాకు చెందిన బాధిత కుటుంబ సభ్యుడు గడిపెల్లి సందీప్ ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలిపిన వివరాలిలా.. 21పిట్ ఏరియాకు చెందిన సందీప్ సోదరి లక్ష్మీప్రసన్న ఉద్యోగ అన్వేషణ కోసం సెల్‌ఫోన్‌లో ఉద్యోగ ప్రకటనలు పరిశీలిస్తున్న క్రమంలో ఇన్‌స్టాగాం నుంచి ఒక యాప్‌ను సందర్శించింది. బయోడేటా మాదిరిగా ఉన్న ఫాంను పూర్తిచేసి సెండ్ చేయగా.. ఓటీపీ ఎంటర్ చేయమంది వెంటనే ఓటీపీ ఎంటర్ చేయగా.. క్షణంలోనే ఆమె బ్యాంకు అకౌంట్‌లోని రూ.19 వేలు డ్రా అయినట్లు గుర్తించింది. దీంతో తాను మోసపోయామని గుర్తించి ఆమె సోదరుడు సందీప్ ద్వారా పోలీసులను ఆశ్రయించింది. ఈమేరకు హెడ్‌కానిస్టేబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో 22 మంది మావోల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పోలీసుల ఎదుట ఒకేసారి భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా పోలీసులు నిర్వహిస్తున్న 'పునా నార్కోమ్' క్యాంపెయిన్(పునరావాస డ్రైవ్)కు ఆకర్షితులైన ఏడుగురు మహిళలు సహా 22మంది నక్సలైట్లు ఎస్పీ కిరణ్ చౌహాన్, సీఆర్పీఎఫ్ కమాండెంట్ నరేంద్ర పాల్ సింహ్ ఎదుట శుక్రవారం సాయంత్రం లొంగిపోయారు. జిల్లాలోని థానా చింతగుప్ప, థానా బెజ్జి తదితర ప్రాంతంలో మావోయిస్టులు కార్యకలాపాలు అధికంగా ఉండడంతో లొంగిపోయేలా ప్రోత్సహించేందుకు పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారులు సంయుక్తంగా 'పునా నార్కోమ్' ప్రవేశపెట్టాయి. దీంతో ఒకేసారి 22 మంది మావోయిస్టులు లొంగిపోయారని వెల్లడించారు.

మద్యం దుకాణాలకు నోటిఫికేషన్..



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

- ఈ నెల 18 వరకు దరఖాస్తు గడువు
- తొలిరోజు 9 అప్లికేషన్లు

కొత్తగూడెంటౌన్: నూతన మద్యం దుకాణాల కేటాయింపునకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ జానయ్య తెలిపారు. శుక్రవారం బాబుక్యాంప్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2023-25 కాలానికి దుకాణల కోసం ఈ నెల 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 88 మద్యం దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉండగా, 44 మద్యం దుకాణాలు ఎస్టీలకు, గౌడలకు 6, ఎస్సీలకు 7, జనరల్ కేటగిరీలో 31 దుకాణాలను రిజర్వ్ చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు డీడీ/ చలాన్‌ల రూపంలో స్వయంగా చెల్లించాలన్నారు. తొలిరోజు అశ్వారావుపేటలో 9 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు కరంచంద్, జయశ్రీ, గుర్నాథ్, నాగయ్య, రహీమున్నీసా, రామ్మూర్తి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలని ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో కొత్తగూడెం, భద్రాచలం ట్రాఫిక్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాల బారిన పడి పలువురు మృత్యువాత పడుతున్నారని, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాద సూచిక గుర్తులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై నిఘా పెట్టాలన్నారు. ట్రిపుల్ రైడ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఎక్కువసార్లు పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై నరేష్, భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిల్ తెమ్మన్నందుకు దాడి..

భద్రాచలంఅర్బన్: భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆదర్శ నగర్ కాలనీకి చెందిన ముదిగొండ ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి ఈ నెల 2వ తేదీ సాయంత్రం ఏఎస్ఆర్ కాలనీలోని మసీద్ వద్ద మిత్రులు పంగి శివ, బొడ్డు అఖిల్, సత్తిలతో కలిసి సరదాగా మాట్లాడుతున్నాడు. ఈక్రమంలో ఉమామహేశ్వరరావు వాటర్ బాటిల్ తీసుకురమ్మని అఖిల్‌కు చెప్పగా కోపంతో ఉమామహేశ్వరరావును కొట్టాడు. పక్కనే ఉన్న మిత్రులు వారిని విడిపించి వారివారి ఇళ్లకు పంపిన తర్వాత రమేష్ అనే వ్యక్తి మరలా పిలిపించి మాట్లాడుతుండగా.. మరల గొడవై కొట్టుకున్నారు. దీంతో ఉమామహేశ్వరరావుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స పొంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో తనపై దాడి చేసిన పంగి శివ, బొడ్డు అఖిల్, సత్తి, దుర్గ, సందీప్ రెడ్డి, వెంకటేష్, గుండు శివలపై ఫిర్యాదు చేశాడు. తనను నోటికొచ్చినట్లు తిట్టడంతో పాటు చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ

బోనకల్: మండల కేంద్రంలోని మణికంఠ వస్త్ర దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆర్వోబీ సమీపంలోని షాపు తాళాలు పగులగొట్టిన దుండగులు రూ.2 లక్షలు విలువైన వస్త్రాలు, సౌండ్ సిస్టమ్, సీసీ కెమెరా వీవీఆర్ ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం గుర్తించిన యజమాని గుగులోతు దుర్గాప్రసాద్ ఫిర్యాదుతో పోలీసులు, క్లూస్‌టీం సభ్యులు చేరుకుని వివరాలు సేకరించారు.

క్లుప్తంగా...

కౌంటరు వేయకపోతే జరిమానా తప్పదు

ఉమ్మడి ఆస్తుల విభజనకేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు హెచ్చరిక



సాక్షి, న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఉమ్మడి ఆస్తుల విభజన కేసులో కౌంటరు దాఖలు చేయకుంటే జరిమానా తప్పదని కేంద్రాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఇరురాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజన జాప్యంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీ.భట్టిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఉమ్మడి ఆస్తుల విభజనకు జస్టిస్ రామసుబ్రమణియన్‌ను మధ్యవర్తిగా నియమించాలని ఏపీ తరపు ఏఓఆర్ మెహ్‌ఫూజ్ నజ్కీ కోరారు. దీనికి తెలంగాణ తరపు న్యాయవాది వైద్యనాథన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమయంలో కేంద్రం కౌంటరు దాఖలు చేయని విషయం ధర్మాసనం దృష్టికి రాగా, గతంలో 4 వారాల గడువు ఇచ్చినా ఇప్పటికీ దాఖలు చేయలేదా అని ప్రశ్నించింది. 3 వారాల్లోగా కౌంటరు దాఖలు చేయాలని లేకుంటే జరిమానా విధిస్తామని కేంద్రం తరపు న్యాయవాదికి తెలిపింది. కేంద్రం కౌంటరుపై రిజాయిండరు దాఖలుకు మరో మూడు వారాలు గడువిస్తూ... తదుపరి విచారణ అక్టోబరుకు వాయిదా వేసింది.

వైద్యారోగ్యశాఖలో 'రెవెన్యూ' పెత్తనం సహించం

తెలంగాణ ప్రభుత్వవైద్యుల సంఘం


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో రెవెన్యూ అధికారుల పెత్తనాన్ని సహించేది లేదని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం స్పష్టం చేసింది. ఆర్డీవోలను పర్యవేక్షణ అధికారులుగా నియమించే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్లుగా వైద్యవిధాన పరిషత్‌లో పనిచేసే వైద్యులను, సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసి, ట్రెజరీ ద్వారా జీతాలు అందించాలని కోరింది. మెడికల్ కళాశాలలో పనిచేసే వైద్యులకు 2016 పీఆర్సీ వేతన బకాయిలు, రూరల్ మెడికల్ కళాశాలల్లోని బోధన వైద్యులకు రూరల్ అలవెన్సులు వెంటనే విడుదల చేయాలని కోరింది. హెల్త్ డైరెక్టర్ పరిధిలో నిర్ణీతకాల వ్యవధి ప్రమోషన్లను వెంటనే కల్పించాలని, సీనియారిటీ ప్రాతిపదికన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులను, డీసీహెచ్‌ఎస్‌లను 33 జిల్లాలకు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల ప్రతినిధుల బృందం త్వరలో సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపింది.

వివేకా లేఖను పట్టించుకోరా?

అన్ని గొడ్డలి వేట్లు పడ్డాక ఆయన లేఖ రాశారా?

మెదడు బయటికి వచ్చాక కూడా రాయడం సాధ్యమేనా?

- ఈ విషయంపై వైద్యుల అభిప్రాయం తీసుకోవాలి కదా!
- ఇంత ముఖ్యమైన అంశాన్ని ఎందుకు విస్మరించారు?
- ఘటనా స్థలంలో వేలి ముద్రల సంగతి ఏమైంది?
- అక్కడున్న వారందరివీ కాకుండా కొత్త వేలి ముద్రలు ఎవరివి?
- నిందితులు ఆస్తి పత్రాల కోసం వెదికారన్నది వాస్తవం..
- అలాంటప్పుడు ఈ అంశంపై ఎందుకు దృష్టి పెట్టలేదు?
- అవగాహన లేకుండా గూగుల్ టేక్ అవుట్ అంటూ హడావుడి దేనికి?
- ఐపీడీఆర్ డేటా ద్వారా కాల్స్, మెసేజ్‌ల వివరాలన్నీ తెలియవు
- వివేకా హత్య కేసు దర్యాప్తు తీరుపై 'ద వైర్' విశ్లేషణాత్మక కథనం



సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అత్యంత కీలకమైనదిగా భావిస్తున్న వివేకా లేఖపై సీబీఐ నిశితంగా దృష్టి సారించక పోవడం విస్మయ పరుస్తోందని ప్రముఖ జాతీయ వార్త వెబ్ సైట్ 'ద వైర్' పేర్కొంది. 'డ్రైవర్ ప్రసాద్ తనపై తీవ్రంగా దాడిచేసినట్టు వివేకా పేర్కొన్నట్టు ఆ లేఖలో ఉంది. లేఖను వంట మనిషి లక్ష్మమ్మ కుమారుడు ప్రకాశ్ చూసి పీఏ కృష్ణా రెడ్డికి ఇచ్చాడు. ఆయన వెంటనే అంటే ఉదయం 6.29కి వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్‌చేసి ఆ లేఖలోని సమాచారాన్ని చదివి వినిపించారు. తాము వచ్చే వరకు లేఖను గోప్యంగా ఉంచమని, ఎవ్వరికీ ఇవ్వొద్దని చెప్పారు. కాసేపటి తర్వాత అక్కడకు వచ్చిన సీఐ శంకరయ్యకు కూడా కృష్ణారెడ్డి ఆ లేఖ విషయం చెప్పలేదు. వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరెడ్డి తదితరులు పులివెందులకు చేరుకున్నాక ఆ రోజు సాయంత్రం ఆ లేఖను వైఎస్సార్ జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మకు అప్పగించారు' అనే విషయాన్ని చార్జ్‌షీట్‌లో ప్రస్తావించడం మినహా ఇంత కీలకమైన విషయంపై సీబీఐ ఎందుకు లోతుగా దర్యాప్తు చేయలేదని ప్రశ్నించింది. రాజకీయ, నేర సంబంధమైన పరిశోధనాత్మక పాత్రికేయంలో 20 ఏళ్ల అనుభవం ఉన్న ప్రముఖ జర్నలిస్ట్ సరితా రాణి 'ద వైర్' వెబ్‌సైట్‌లో రాసిన రెండవ కథనంలో ఆసక్తికర విషయాలను ప్రస్తావించారు. ఆ వివరాలివీ..

తీవ్ర గాయాలతో లేఖ రాయగలిగారా?

వివేకా లేఖపై ఇప్పటికీ సందిగ్ధత తొలగిపోలేదు. సీబీఐ దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి వాంగ్మూలం ఇప్పించే వరకు ఆ లేఖ ఎప్పుడు రాశారన్న దానిపై స్పష్టత రాలేదు. వివేకాపై దాడి తర్వాత ఆయనతో బలవంతంగా ఆ లేఖను తాము ఎలా రాయించిందీ దస్తగిరి వెల్లడించాకే సందేహాలు మరింత పెరిగాయి. దస్తగిరి తన వాంగ్మూలంలో వెల్లడించిన ప్రకారం.. మొదట సునీల్‌యాదవ్ వివేకానందరెడ్డి ముఖంపై గట్టిగా కొట్టాడు. దాంతో వివేకా కింద పడిపోయారు. ఉమాశంకర్ రెడ్డి గొడ్డలితో వివేకా నుదుట మీద నరికాడు. వివేకా నుదుటి మీద 3.5 ఇంచ్‌ల వెడల్పు, 6 ఇంచ్‌ల లోతుగా పక్క పక్కనే రెండు గాయాలున్నాయని పోస్టుమార్టం నివేదికలో ఉంది. సునీల్‌యాదవ్ వివేకా గుండెపై 15–16 సార్లు గట్టిగా పిడిగుద్దులు గుద్దాడు. ఉమాశంకర్ రెడ్డి తన చేతిలో ఉన్న గొడ్డలిని దస్తగిరికి ఇచ్చి వివేకా లేవకుండా చూడమని చెప్పారు. తాము భూమి పత్రాలు ఎక్కడున్నాయో వెతుకుతామని చెప్పాడు. వివేకా అతి కష్టం మీద లేవడానికి ప్రయత్నిస్తూ నా ఇంట్లో ఏం వెతుకుతున్నారని ప్రశ్నించారు. దాంతో దస్తగిరి గొడ్డలితో వివేకా కుడి చేతిపై దాడి చేశాడు. దీంతో వివేకా కుడి అరచేతిలో 2 ఇంచ్‌ల వెడల్పు, ఒక ఇంచి లోతున గాయం ఉందని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. కుడి చేతి మీద గొడ్డలితో గాయపరిచిన తర్వాత వివేకాతో నిందితులు లేఖ రాయించారు. కుడి చేతివాటం వ్యక్తి అయిన వివేకా ఆ లేఖ రాశారని సీబీఐ పేర్కొంది. గాయం వల్ల వివేకా మెదడు బయటకు వచ్చిందని దస్తగిరి చెప్పడం గమనార్హం. అంత తీవ్ర గాయమయ్యాక లేఖ రాసే స్థితిలో వివేకా ఉన్నారా అన్నది ప్రశ్నార్థకం. ఆ లేఖ వివేకానే రాసినట్టు హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ నిర్ధారించింది. కాగా తీవ్రమైన ఒత్తిడి, అత్యంత సంక్లిష్ట ప్రక్రియ నడుమ ఆ లేఖ రాసినట్టుగా ఉందని ఢిల్లీలోని సీఎఫ్ఎస్ఎల్ నివేదిక వెల్లడించింది. కానీ అంతటి తీవ్ర గాయాలతో, మెదడు బయటకు వచ్చిన తర్వాత కూడా ఓ వ్యక్తి అలా లేఖ రాయడం సాధ్యమా? అని సీబీఐ వైద్య నిపుణులను సంప్రదించకపోవడం విడ్డూరం.

ఆ వేలిముద్రలు ఎవరివో?

హత్య కేసు దర్యాప్తులో వేలిముద్రలే కీలకం. అయితే వివేకా హత్యకు గురైన స్థలంలో గుర్తించిన 3 గుర్తు తెలియని వేలిముద్రలు ఎవరివనే దానిపై సీబీఐ ఇప్పటి వరకు దృష్టిసారించలేదు. వివేకా నివాసంలోని బాత్‌రూమ్ గోడల టైల్స్ మీద రెండు, తలుపు వెనుక ఒక వేలిముద్రను క్లూస్ టీమ్ గుర్తించింది. గోడల టైల్స్ మీద ఉన్న వేలిముద్రలు రక్తంతో ఉండటం గమనార్హం. కాగా ఆ మూడు వేలి ముద్రలు నిందితులు నలుగురితోపాటు వివేకా నివాసానికి వచ్చిన బంధువులు, ఇతరుల వేలి ముద్రలతో సరిపోలలేదు. అంటే గుర్తు తెలియని వ్యక్తులు ఆ రోజు రాత్రి వివేకా నివాసంలో ఉన్నట్టుగా భావించాల్సి వస్తోంది. కానీ సీబీఐ ఇప్పటి వరకు ఆ వేలిముద్రలు ఎవరివనే దిశగా దర్యాప్తు చేయలేదు.

ఐపీడీఆర్ డేటా అహేతుకం

ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్‌రెడ్డి మధ్య వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు 'ఇంటర్నెట్ ప్రొటోకాల్ డిటైల్ రికార్డ్స్(ఐపీడీఆర్) నివేదిక ఆధారంగా గుర్తించినట్టు సీబీఐ పేర్కొంది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 1.37 నుంచి 5.02 గంటల వరకు వారిద్దరి మొబైల్ ఫోన్ల డేటా ఆన్‌లో ఉన్నట్టుగా చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ ఐపీడీఆర్ డేటా అన్నది శాస్త్రీయంగా కచ్చితమైన ఆధారం కాదు. ఆ సమయంలో మొబైల్ ఫోన్లు ఆన్‌లో ఉన్నాయని మాత్రమే ఐపీడీఆర్ చెబుతుంది. సాధారణంగా అర్ధరాత్రి దాటాక మొబైల్ నెట్‌వర్క్‌లు తమ డేటా బ్యాకప్ తీసుకుంటూ ఉంటాయి. దాంతో మొబైల్ డేటా ఆన్‌లో ఉన్నట్టు చూపిస్తుంది. అంత మాత్రాన ఆ మొబైల్ ఫోన్ల ద్వారా మాట్లాడుతున్నట్టుగానీ, మెసేజ్‌లు పంపిస్తున్నట్టుగానీ నిర్ధారించినట్టు కాదు. ఇక ఆ ఫోన్ల నుంచి ఇతర ఫోన్లకు మెసేజ్‌లు వెళ్లాయా.. లేదా అన్నది కూడా ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. కాబట్టి ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్‌రెడ్డి మధ్య ఆ రోజు రాత్రి వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించలేం. ఈ విషయంలో సీబీఐ వాదన పూర్తిగా అహేతుకమని స్పష్టమవుతోంది. గంగిరెడ్డి మొబైల్ ఫోన్ నుంచి వెళ్లిన మెసేజ్‌లను గుర్తించేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదని సీబీఐ తెలిపింది. కాగా 2019 మార్చి 15నే ఎర్ర గంగిరెడ్డి మొబైల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డేటాను పరిశీలించినా.. అందులో అనుమానాస్పదమైన సమాచారం లభించలేదని పోలీసులు ప్రకటించిన విషయం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆస్తి వివాదాన్ని ఎందుకు పట్టించుకోలేదు?

రాజకీయ కారణాలతోనే వివేకాను హత్య చేశారని సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ దస్తగిరి, రంగన్న వాంగ్మూలాలను పరిశీలిస్తే ఆస్తి కోసం ఈ హత్య చేసి ఉండొచ్చన్నది స్పష్టమవుతోంది. ఎందుకంటే వివేకాను హత్య చేసిన తర్వాత నిందితులు ఆస్తి పత్రాల కోసం ఆయన నివాసంలో వెతికారన్నది స్పష్టమవుతోంది. నివాసంలో అల్మారా (బీరువా) తలుపు బద్దలు గొట్టడానికి ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు కూడా. అంటే హత్యకు ఆస్తి వివాదం ప్రధాన కారణం కావచ్చు. నిందితులు ఏ పత్రాల కోసం వెతికారన్నది సీబీఐ ఇప్పటి వరకు గుర్తించలేకపోయింది. దొంగతనం, ఆస్తి వివాదం అనే కోణంలో సీబీఐ ఈ కేసును ఎందుకు దర్యాప్తు చేయడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఒకే సమయంలో రెండుచోట్ల ఉండటం సాధ్యమా?

సునీల్ యాదవ్ ఎక్కడ ఉన్నారనే దానిపై సీబీఐ వాదనలు మరింత అసంబద్ధంగా ఉన్నాయి. దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఇప్పించిన వాంగ్మూలం, రంగన్న వాంగ్మూలం ప్రకారం ఆ రోజు రాత్రి 1.30 గంటల నుంచి 3 గంటల వరకు సునీల్ యాదవ్ వివేకానందరెడ్డి నివాసం లోపల ఉన్నాడు. కానీ ఆ రోజు రాత్రి 1.58 గంటలకు సునీల్ యాదవ్.. వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసంలో ఉన్నట్టుగా గూగుల్ టేక్ అవుట్ డేటా చూపిస్తోందని కూడా సీబీఐ పేర్కొంది. ఒకే సమయంలో ఒక వ్యక్తి వేర్వేరు చోట్ల ఎలా ఉండగలరు? సునీల్ యాదవ్ ఆ సమయంలో వైఎస్ భాస్కర్ రెడ్డి నివాసంలో ఉంటే.. అదే సమయంలో అక్కడికి కిలోమీటర్ దూరంలో ఉన్న వివేకా నివాసంలో కూడా ఉండి ఆయన్ను ఎలా హత్య చేయగలడు? మరి సీబీఐ ఇంత చిన్న అంశాన్ని విస్మరిస్తూ కేసు దర్యాప్తు చేస్తుండటం ఏమిటి?.

రూ.40 కోట్ల డీల్ కథ తేల్చలేదెందుకు?

అసలు వివేకానందరెడ్డిని నిందితులు ఎందుకు హత్య చేశారనే అంశంపై సీబీఐ వాదన అసంబద్ధంగా ఉంది. దస్తగిరి వాంగ్మూలం ప్రకారం.. వివేకాను హత్య చేస్తే శివశంకర్ రెడ్డి రూ.40 కోట్లు ఇస్తారని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పారని దస్తగిరి పేర్కొన్నాడు. అందుకు సునీల్ యాదవ్ ద్వారా దస్తగిరికి అడ్వాన్స్‌గా రూ.కోటి పంపించారు. అందులో రూ.25 లక్షలు సునీల్ యాదవ్ అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బులతో పులివెందులలో విల్లా కొనుగోలు చేయాలని భావించినట్టు దస్తగిరి చెప్పాడు. కాగా ఇక్కడ ప్రశ్నార్థకం ఏమిటంటే.. వివేకా హత్య కోసం కుదిరినట్టు చెబుతున్న డీల్ డబ్బును సీబీఐ ఇప్పటికీ రికవరీ చేయలేకపోయింది. కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కూడా సీబీఐని ఇదే విషయంపై ప్రశ్నించారు. నిందితుల మధ్య చేతులు మారినట్టు చెబుతున్న డబ్బును ఎందుకు రికవరీ చేయలేకపోయారంటే సీబీఐ సరైన సమాధానం చెప్పలేకపోయింది. పులివెందులలో చెప్పుల దుకాణం నిర్వహిస్తున్న మున్నా బ్యాంక్ లాకర్ నుంచి రికవరీ చేసిన రూ.46.70 లక్షలకు సంబంధించి సీబీఐ చెబుతున్న వాదన నమ్మదగ్గదిగా లేదని కూడా న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. 2020 సెప్టెంబర్ 9న మున్నా బ్యాంకు లాకర్లో ఉన్న రూ.46.70 లక్షలను సీబీఐ జప్తు చేసింది. ఈ జప్తు వ్యవహారం భారత సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 27 ప్రకారం లేదని న్యాయస్థానం స్పష్టం చేయడం గమనార్హం.

గూగుల్ టేక్ అవుట్‌పై మాట మారింది!

నిందితులు 2019 మార్చి 14, 15 తేదీల్లో ఎక్కడ ఉన్నారనే విషయాన్ని గూగుల్ టేక్ అవుట్ ద్వారా నిర్ధారించామన్న సీబీఐ వాదన తప్పని తేలిపోయింది. ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి ఫోన్లు వారి ఇళ్లలోనే ఉన్నట్టుగా సెల్ టవర్ల లోకేషన్ స్పష్టం చేస్తోంది. కాగా సునీల్ యాదవ్ మొబైల్ ఫోన్ గూగుల్ టేక్ అవుట్ డేటాపై సీబీఐ ఎక్కువగా దృష్టి సారించింది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 2.42కి సునీల్ యాదవ్ వివేకా నివాసంలో ఉన్నట్టు.. 2.34కి వివేకా నివాసానికి 15 మీటర్ల దూరంలో, 2.35కి వివేకా నివాసానికి 10 మీటర్ల దూరంలో ఉన్నట్టు.. 2.42కి వివేకా నివాసంలో ఉన్నట్టు పేర్కొంది. కాగా సునీల్ యాదవ్ నివాసం వివేకా నివాసానికి 160 మీటర్ల దూరంలోనే ఉంది. ఇది ఎంతో ముఖ్యమైన అంశం. ఎందుకంటే పట్టణ ప్రాంతాల్లో గూగుల్ టేక్ అవుట్ డేటాకు, వాస్తవ లోకేషన్‌కు 500 మీటర్ల నుంచి 1,500 మీటర్ల వరకు వ్యత్యాసం ఉంటుందని నిపుణులే చెబుతున్నారు. అందుకే ఈ కేసు విచారణ సమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఆ విషయాన్ని ప్రశ్నించారు. గూగుల్ టేక్ అవుట్ డేటాను బట్టి ఎలా నిర్ధారించగలుగుతారని అడిగారు. దాంతో సీబీఐ తన మూడో అనుబంధ చార్జ్‌షీట్‌లో మాట మార్చింది. యూనివర్సల్ కాలమానానికి (యూటీసీ), భారత కాలమానానికి (ఐటీసీ) మధ్య వ్యత్యాసాన్ని తాము గమనించక పొరపాటు చేశామని వెల్లడించడం గమనార్హం. గూగుల్ టేక్ అవుట్ డేటాను విశ్లేషిస్తూ ఢిల్లీలోని సీఎఫ్ఎస్ఎల్ పేర్కొన్న సమయం యూటీసీ కాలమానం ప్రకారం అని వెల్లడించింది. వాస్తవానికి యూటీసీ కాలమానం కంటే భారత కాలమానం 5.30 గంటలు ముందుంటుంది. అంటే సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 14 అర్ధరాత్రి దాటిన తర్వాత 2.42 గంటలకు ఉన్నట్టు తాము మొదటి చార్జ్‌షీట్‌లో పేర్కొంది వాస్తవం కాదని సీబీఐ అంగీకరించింది. సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 15న ఉదయం 8.12కి ఉన్నారని తెలిపింది. అంటే వివేకా హత్యకు గురయ్యారని అందరికీ తెలిసిన తర్వాత కొన్ని వందల మంది అక్కడ గుమిగూడిన తర్వాత సునీల్ యాదవ్ చేరుకున్నారని చెప్పింది.

జిల్లా వార్తలు

జనారణ్యంలోకి చుక్కల దుప్పి..

కిన్నెరసానికి తరలిస్తుండగా మృతి



జనావాసాల్లో తిరుగుతున్న దుప్పి

సత్తుపల్లిటౌన్: చెంగుచెంగున దూకుతూ జనారణ్యంలోకి వచ్చిన చుక్కల దుప్పి శుక్రవారం సత్తుపల్లిలో అటవీశాఖ సిబ్బందికి చిక్కింది. స్థానిక అయ్యగారిపేట రోడ్డులో నివాసాల మధ్య మైదానంలో మేత మేస్తున్న చుక్కల దుప్పిని స్థానికులు గమనించి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఎఫ్‌బీఓ ముక్తి వెంకటేశ్వర్లు సిబ్బందితో చేరుకుని వల వేసి దుప్పిని పట్టుకున్నారు. కాగా, అటూఇటు దూకుతున్నప్పుడు ప్రహరీని తాకడంతో దుప్పి మూతికి గాయాలయ్యాయి. దీంతో పశువైద్యశాలకు తరలించి చికిత్స చేయించాక కిన్నెరసాని అభయారణ్యానికి తరలిస్తుండగానే మృతి చెందింది. ఈమేరకు పశువైద్యులు పోస్టుమార్టం నిర్వహించాక అర్బన్ పార్కులో ఖననం చేశారు. కాగా, కాకర్లపల్లి బీట్ నుంచి ఈ దుప్పి వారం క్రితం తప్పించుకొచ్చినట్లు తెలిసింది.

పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన ఓఅండ్‌ఎం సీఈ



పాలేరు అలుగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఈ

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను శుక్రవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్(ఓఅండ్‌ఎం) సీఈ జి.రమేష్‌బాబు పరిశీలించారు. ఇటీవల వరదలతో జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులకు కలిగిన నష్టాన్ని ఆయన అంచనా వేసేందుకు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాలేరును సందర్శించి గేట్లు, అలుగుల వద్ద వరద ప్రవాహంపై ఆరా తీశారు. ఆతర్వాత మండలంలోని భక్తరామదాసు ప్రాజెక్టును కూడా సందర్శించి వరద నష్టం వివరాలు తెలుసుకున్నారు. నీటిపారుదలశాఖ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డీఈఈలు రత్నకుమారి, మధు తదితరులు ఉన్నారు.

మళ్లీ ఇనుప వంతెనే దిక్కు!



నడిమిగూడెం - మోదుగులగూడెం మధ్య కోతకు గురైన బ్రిడ్జి



ఇనుప వంతెన మీదుగా దాటుతున్న గిరిజనులు

- 2021లో నిర్మించినా చెక్కుచెదరని వైనం
- ఆ తర్వాత నిర్మించిన బ్రిడ్జి మాత్రం కోత

గుండాల: నాడు భారీ వర్షాలతో రాకపోకలు నిలిచిపోయాయి.... బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతుండడంతో గిరిజనులు దిక్కుతోచని స్థితిలో కర్రల సాయంతో దాటుతున్నారు. ఈ క్రమంలో 'సాక్షి'లో 'ఈ సాహసం ప్రమాదకరమై'నది'' శీర్షికన ప్రచురితమైన కథనంతో స్పందించి పోలీసులు తాత్కాలికంగా ఇనుప వంతెన నిర్మించారు. అప్పట్లో ఈ వంతెన గిరిజనులకు ఆదెరువుగా నిలవగా.. అనంతరం బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. కానీ మొన్నటి వర్షాలకు బ్రిడ్జి కొట్టుకుపోయినా, ఇనుప వంతెన మాత్రం చెక్కు చెదరకపోవడంతో ఇప్పుడు గిరిజనులకు మళ్లీ అదే దిక్కయింది.

2021లో తాత్కాలికంగా...

మండలంలోని మోదుగుల గూడెం–నడిమిగూడెం మధ్య కిన్నెరసానిపై 2021కి ముందే బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. కానీ పూర్తికాకపోవడంతో వర్షకాలంలో దాటుడు బండలపై కర్రలు వేసి గిరిజనులు దాటేవారు. 2021 జూలైలోనూ భారీ వర్షాలు కురుస్తున్న సమయాన ఇదే పరిస్థితి నెలకొనగా ప్రమాదకరంగా మారిన విషయమై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో అప్పటి గుండాల ఎస్సై ముత్యం రమేష్ తన సిబ్బందితో కలిసి ఇనుప వంతెన ఏర్పాటు చేశారు.

అనంతరం 2022లో బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. అప్పటి నుంచి రాకపోకలు సాఫీగా సాగుతున్నా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి రెండు వైపులా కోతకు గురైంది. ఫలితంగా ఆనాడు పోలీసులు ఏర్పాటుచేసిన వంతెన పైనుంచే మళ్లీ గిరిజనులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వాగులు వస్తున్న క్రమంలో నడిమిగూడెం, సజ్జలబోడు, నాగారం, కొడవటంచ, పాలగూడెం, దొంగతోగు గ్రామాలకు ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతోంది.

ఈమేరకు ఇనుప వంతెనపై దాటుతున్న ఆయా గ్రామాల ప్రజలు ఇప్పుడు కొత్తగూడెంలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ముత్యం రమేష్‌ను సేవలను గుర్తుచేసుకుంటున్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో

15 రోజులుగా పర్ణశాలవాసుల ఇక్కట్లు

దుమ్ముగూడెం: మిషన్ భగీరథ ఇంటేక్‌వెల్, ప్లాంట్ ఉన్నది అక్కడే.. అక్కడి నుండే మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. కానీ ఆ గ్రామానికి మాత్రం 15 రోజులుగా తాగు నీరు అందడంలేదు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో గత 15 రోజులుగా తాగునీరు రాకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ చెంతనే గోదావరి ఉన్న తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక నరకయాతన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గోదావరికి వరద వచ్చినప్పటి నుంచి ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు. గంట పాటు రాస్తారోకో చేపట్టడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి రాస్తారోకో విరమింప చేశారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులు కూడా పర్ణశాల వచ్చి నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు.



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

అడవుల పునరుద్ధరణకు శ్రమించాలి: సీసీఎఫ్ భీమానాయక్

ఇల్లెందురూరల్: అడవుల పునరుద్ధరణకు ప్రతీఒక్కరు శ్రమించాలని సీసీఎఫ్ భీమానాయక్ సూచించారు. ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో ఏర్పాటుచేసిన మంకీ ఫుడ్ కోర్టును శుక్రవారం ఆయన పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అటవీశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమైన సీసీఎఫ్ మాట్లాడుతూ.. పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసినందున, ఇక నుంచి కొత్త పోడుకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. అలాగే, నిర్దేశిత లక్ష్యం మేరకు ప్లాంటేషన్ చేపట్టాలని, కలప స్మగ్లింగ్‌ను అరికట్టడంలో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణగౌడ్, ఎఫ్‌డీఓ కె.వెంకన్న, ఎఫ్ఆర్‌ఓ నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బొజ్జాయిగూడెంలో మంకీఫుడ్ కోర్టును పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్, అధికారులు

అవశేషాలను దహనం చేయకండి..

- అలా చేస్తే సమస్యలు ఉత్పన్నం
- పశువులకు దాణాగా ఉపయోగించే అవకాశం
- ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని అధికారుల సూచన



ఎం.విజయనిర్మల, ఖమ్మం డీఏఓ

ఖమ్మంవ్యవసాయం: పంట కోతలు పూర్తయ్యాక అవశేషాలను రైతులు దహనం చేస్తున్నారు. తద్వారా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గత యాసంగి సీజన్‌లో పండించిన పంటలకు సంబంధించి 4,587 ఎకరాల్లో సాగు చేసిన పంటల అవశేషాలను రైతులు దహనం చేసినట్లు ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటల అవశేషాలు ఉన్నట్లు ఆ శాఖ గుర్తించింది. అయితే, వీటిని దహనం చేయడం వల్ల సమస్యలు వస్తాయని, అలాకాకుండా పశువులకు దాణాగా ఉపయోగించే అవకాశమున్నందున దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల సూచించారు. ఈమేరకు ఆమె వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.





వరి, పత్తి పంటల అవశేషాలను దహనం చేస్తున్న రైతులు

అవశేషాలు కాల్చడానికి కారణాలు

రైతులు పంట కోసి, మరో పంట వేయడానికి మధ్యలో సమయం తక్కువగా ఉండడంతో త్వరగా అవశేషాలను తొలగించడానికి దహనం చేయడాన్ని సులభమైన మార్గంగా ఎంచుకుంటున్నారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటల అవశేషాలు కుళ్లడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పట్టడంతో కాల్చడమే మేలని భావిస్తున్నారు. ఒకవేళ పంట అవశేషాలను తొలగించకుండా వదిలేస్తే చెదపురుగులు, తెల్లదోమ వ్యాప్తి పెరుగుతుంది. పత్తిపంటలో గులాబీ రంగు పురుగు, కాయ తొలుచు పురుగు వ్యాప్తి చెంది ఆతర్వాత పంటల దిగుబడి పడిపోతుంది.

కాలిస్తే ఎదురయ్యే సమస్యలు..

పంట అవశేషాల సేకరణ, దహనం పర్యావరణ కాలుష్యానికి దారి తీస్తుంది. ముఖ్యంగా కర్బన సమ్మేళనాల వంటి ప్రమాదకర వాయువులు, గ్రీన్ హౌస్ వంటి వాయువులను విడుదల చేస్తాయి. ఇప్పటికే ఉన్న వాయు కాలుష్యానికి ఇది తోడై గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులకు దారితీస్తుంది. అలాగే, పంట అవశేషాలు కాల్చడం వలన వాతావరణంలోకి కార్బన్ మోనాక్సైడ్ విడుదలై దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయి. ప్రజలకు వాయు కాలుష్యం, [illegible]లో అంతరాయం, శ్వాస కోశ సమస్యలు చోటు చేసుకుంటాయి. పంట అవశేషాలు కాల్చడం వలన విలువైన నేల సేంద్రియ పదార్థాలు, పోషక పదార్థాలు కోల్పోవడం, నేల నిస్సారంగా మారుతుంది. నేలలో ఉన్న నత్రజని, కార్బన్ స్థాయిని తగ్గిస్తుంది. దీర్ఘకాలంలో పంట ఉత్పాదకతపై ప్రభావం పడుతుంది. దహనం వలన ఉత్పన్నమయ్యే వేడి మట్టిలో ఉండే ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, పర్యావరణ అనుకూల కీటకాలు నశించిపోతాయి.

మరేం చేయాలి...

పంటల అవశేషాలను తగలబెట్టకుండా వదిలేస్తే నత్రజని, కార్బన్, పాస్పరస్ వంటి పోషకాలను నేలకు అందిస్తాయి. నేలలో సేంద్రియ కార్బన్, నీటి నిల్వ సామర్థ్యం మెరుగవుతుంది. సూక్ష్మజీవులు, సేంద్రియ పదార్థ ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. నేలలో సేంద్రియ పదార్థాన్ని అధికం చేస్తుంది. కుళ్లిన తరువాత నేల సారం కావడాన్ని మెరుగుపరుస్తుంది. జొన్న, మొక్కజొన్న, వేరుశనగ పంటల అవశేషాలను పశవుల మేతగా కూడా ఉపయోగించే అవకాశముంది. అలాగే, మొక్కజొన్న అవశేషాలు మట్టిలో కలపవచ్చు. ఇది పోషకాలను ఆదా చేయడమే కాక కాల్చడం ద్వారా ఎదురయ్యే కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

ఎన్‌ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా 'పిల్లల కోసం'

ఖమ్మం స్పోర్ట్స్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరింత రాణించేలా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా 'పిల్లల కోసం'పేరిట శిక్షణ ఇప్పించనున్నట్లు కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ డీ.టీ.చారి తెలిపారు. ఖమ్మంలో ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో శుక్రవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం నుంచే కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు విభిన్న మనస్తత్వం కలిగి ఉంటారని, వారికి ఇష్టం లేని సబ్జెక్టుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈమేరకు వీరిని సరైన మార్గంలో పెట్టేందుకు 'పిల్లల కోసం'కార్యక్రమాన్ని అమలుచేయనున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ.జకీరుల్లా, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వలంటీర్లు శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రమాసత్యవతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జాన్‌మిల్టన్, పి.సర్వేశ్వరరావు, జి.రోమిల, అభిజిత్‌విశ్వాస్, అస్రా, ఫాతిమా, కిరణ్, శ్యాంప్రసాద్, కబీర్, గణేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.